


అరకులోయలో వర్షం

ప్రజాశక్తి-అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయలో బుధవారం సాయంత్రం తొలకరి వాన కురిసింది.తీవ్రమైన ఎండ వేడితో ఉక్కిరి బిక్కిరైన మన్యం వాసులకు ఈ తొలకరి వర్షం ఉపశమనం కలిగించింది. తొలకరి వాన కురవడంతో ఈ ప్రాంత వాసులు అందరూ ఆస్వాదించారు. సుమారుగా గంటపాటు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దుక్కి ప్రారంభించడానికి తొలకరి వర్షం ఉపయోగపడుతుందని కొంత మంది గిరిజనులు అభిప్రాయం వ్యక్తం చేశారు.కుండపోత వర్షం కురవడంతో అరకులోయ ప్రాంతంలో కొంత చల్లటి వాతావరణం నెలకొంది. బుధవారం రాత్రి విద్యుత్ కి అంతరాయం కలిగింది.



కురుస్తున్న వర్షం

నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ తీర్పు



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం

- మండలి ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ఇనీషియల్ కౌంటింగ్‌కు 8 గంటలు
- తొలి ఫలితానికి ఒక రోజు సమయం
- 28 టేబుళ్లపై లెక్కింపు
- 500 పైచిలుకు కౌంటింగ్ సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో:ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి తీర్పు వెలువడే సమయం వచ్చేసింది. ఈ నెల 13న జరిగిన పోలింగ్ ఫలితాల కోసం కౌంటింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ ఉత్తరాంధ్ర అంతటా నెలకొంది. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లన్నింటినీ విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చూస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు 2 లక్షలా 926 ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 28 టేబుళ్లను స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌కి 1000 ఓట్ల ఫలితాన్ని సిబ్బంది లెక్కిస్తారు. ఇనీషియల్ (ప్రారంభ) కౌంటింగ్ అయ్యేసరికి 8 గంటల సమయం పడుతుంది. తొలి ఫలితంతో దాదాపు ఒక అంచనాకు రావొచ్చు. పూర్తిగా ఫలితం రాబట్టేందుకు ఒక రోజు వ్యవధి పడుతుందని అధికారులు చెబుతున్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లులో నిమగ్నమైన అధికారులు

విజేత నిర్ణయం ఎలా ?

పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు అధికంగా ఒక అభ్యర్థికి వస్తే వారిని విజేతగా రిటర్నింగ్ అధికారి ప్రకటించవొచ్చు. 8 రౌండ్ల ఇనీషియల్ కౌంటింగ్ తర్వాత ఆపై ఎన్ని రౌండ్లు ఎలిమినేషన్ ఉంటుందో చెప్పలేని పరిస్థితి. 37 మంది అభ్యర్థులు ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బరిలో ఉండగా ప్రధాన పోటీ పిడిఎఫ్, వైసిపి, టిడిపి మధ్య ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నాలుగో స్థానంలో బిజెపి ఉంటుంది. రౌండ్ల వారీగా ఎన్ని ఓట్లు ఏ అభ్యర్థికి వస్తాయన్నదానిపైనా విజయం ఆధారపడి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో ఓటరు అభ్యర్థికి ఓటు వేసే అవకాశం ఉండడంతో ఆ ఓట్ల లెక్కింపు వల్ల సమయం ఎక్కువ పడుతుంది. ఈ ప్రాధాన్యతా క్రమంలో చివర ఉన్న అభ్యర్థులు ఎలిమినేషన్ అవుతూ ఉంటారు. రెండో ప్రాధాన్యతా ఓటుపైనే విజయం ఈ ఎన్నికల్లో ఆధారపడి ఉంటుందన్నది పలువురి నోట వినిపిస్తోంది. ఉత్తరాంధ్రలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటుతో గెలుపొందిన వారెవరూ 2007 నుంచి ఇప్పటివరకూ లేరు. ఈ దఫా కూడా ఇదే ఫార్ములా ఉంటుందన్నది భావిస్తున్నారు. అందుకే రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుంది.

పిడిఎఫ్ గెలుపుపై అంచనా

శాసన మండలి ఎన్నికల ఫలితాలు, విజయావకాశాలపై ఇప్పటికే ఉత్తరాంధ్ర అంతటా చర్చోపచర్చలు జోరుగా సాగుతున్నాయి. ప్రచారంలో 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందున్నారు. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాలు, సిబ్బంది నివేదికలు, ఓటర్ల మాటలను పరిశీలిస్తే రమాప్రభ ప్రభంజనమే సర్వత్రా ఉంటుందని పలువురు చెబుతున్నారు. టీచర్లు, ఉద్యోగులు, నిరుద్యోగుల విషయంలో రాష్ట్రంలోని అధికార వైసిపి సర్కారు నిర్బంధ వైఖరితో ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు పడిందన్నది పై నివేదికల సారాంశం. తెలుగుదేశం, బిజెపిలకు వారివారి పార్టీలకు చెందినవారి ఓట్లు పడినప్పటికీ పిడిఎఫ్‌కు వారు రెండో ప్రాధాన్యత ఓటు వేసినట్లు తెలుస్తోంది.

ఏర్పాట్లు పరిశీలన

ఎంవిపి.కాలనీ : స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ మాక్ కౌంటింగ్ నిర్వహించారు. అనంతరం వారు స్టేడియంలోని ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

గురువారం ఉదయం నుంచే కౌంటింగ్ ప్రారంభమవుతున్నందున స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కౌంటింగ్ సిబ్బంది వాహనాలను బుల్లయ్య కాలేజీ నార్త్ గేటు (రేసపువానిపాలెం) వద్ద వారికి కేటాయించిన పార్కింగ్ స్థలంలో నిలుపుదల చేయాలి. టూ వీలర్స్‌ను బుల్లయ్య కాలేజీ బాస్కెట్‌బాల్ గ్రౌండ్ వద్ద పార్కింగ్ చేసుకోవొచ్చు. స్వర్ణభారతి జంక్షన్ వద్ద రద్దీ దృష్ట్యా బుల్లయ్య కాలేజీ జంక్షన్ నుంచి స్వర్ణభారతి జంక్షన్ వరకు సాధారణ వాహనాలను అనుమతించరు. వాహనదారులు రామాటాకీస్ జంక్షన్ గుండా ప్రయాణించాలి. మద్దిలపాలెం జంక్షన్ నుంచి రామాటాకీస్ జంక్షన్ వరకూ రద్దీ ఎక్కువగా ఉండే అవకాశమున్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. ఇంటర్ పరీక్షలకు వచ్చేవారు సత్యం జంక్షన్ గుండా వచ్చి బుల్లయ్య కాలేజీ మెయిన్ గేటుకు చేరుకోవాలి. స్వర్ణభారతి స్టేడియం చుట్టుపక్కల ఎటువంటి వాహనాలనూ నిలుపరాదు. రామాటాకీస్ నుంచి మద్దిలపాలెంవైపు, మద్దిలపాలెం నుంచి రామా టాకీస్ వైపు వెళ్లవలసిన వాహనదారులు సత్యం జంక్షన్ మీదుగా వెళ్లాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.



పాడేరులో ఆందోళన చేపడుతున్న విఓఎలు

ఉద్యోగ భద్రత కల్పించాలని..

వెలుగు విఓఎల ఆందోళన

20న ఐటిడిఎల ఎదుట మహాధర్నాకు పిలుపు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని మండల కేంద్రాల్లో వెలుగు వివోఏలు(యానిమేటర్లు) తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు మండల మహిళా సమాఖ్య కార్యాలయాల ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం ముందు వివోఏలు నిర్వహించిన ధర్నాలో ఆ సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు ఆర్.భాను మాట్లాడుతూ, వివోఏలకు కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ నెల 20న జిల్లాలోని ఐటీడీఏల స్థాయిలో ఆయా మండలాల వివోఏలతో తమ సమస్యల పరిష్కారానికై మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాడేరు ఐటిడిఎ ఎదుట జరిగే ధర్నాకు 11 మండలాల నుంచి వివోఏలు హాజరవుతారని ఆమె తెలిపారు. ఈ ధర్నా శిబిరాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు సందర్శించి వివోల ధర్నాకు మద్దతు ఇచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండల వివోఏల సంఘం నాయకులు పి.సువర్ణ, జీ.తార, ఎం.కిరణ్మయి, మండలంలోని అన్ని పంచాయతీల నుంచి 36 మంది వివోఏలు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ:ఐకెపిలో పని చేస్తున్న యానిమేటర్లకు హెచ్ఆర్ పాలసీ విధానం అమలు చేసి, ప్రభుత్వం ఇచ్చిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం వద్ద యానిమేటర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు భాస్కరరావు మాట్లాడుతూ, డ్వాక్రా మహిళా సంఘాల నిర్వహణకు యానిమేటర్లు చాలా కీలకమైన పనులు చేస్తున్నారన్నారు సమస్యలను పరిష్కరించకుండా, మూడేళ్ల తర్వాత తొలగించడానికి ప్రభుత్వం కాల పరిమితి సర్క్యులర్ జారీ చేయడం సరికాదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీను, బుచ్చిబాబు, కృష్ణ పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ఆందోళన చేపడుతున్న విఓఎలు

కాఫీ తోటలపై సమగ్ర సర్వే చేయండి

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కాఫీ తోటల ఏకీకరణపై సమగ్రమైన సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ ఆదేశించారు. కాఫీ రైతులకు ఎకరాకు 900 కాఫీ మొక్కలను గతంలో పంపిణీ చేసి నాటించామన్నారు. ఎకరా భూమిలో 650 మొక్కలకు తక్కువ ఉన్న తోటల్లో సర్వే చేసి నివేదికలు సమర్పించాలన్నారు. కాఫీ తోటలు పునరుద్ధరణకు చర్యలు చేపడతామన్నారు. బుధవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో 11 మండలాల ఉద్యానవన అధికారులు, కాఫీ కన్సల్టెంట్లు, లైజాన్ వర్కర్లు, కాఫీ బోర్డు అధికారులతో కాఫీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాఫీ రైతుల ఆదాయం పెరిగే విధంగా కాఫీ తోటలు పునరుద్ధరణ జరగాలన్నారు. లైజాన్ వర్కర్ల పరిధిలో 75 నుండి 100 ఎకరాలలో, రైతుల సమక్షంలో కాఫీ తోటల్లో పర్యటించి సర్వే చేసి, నమూనా పత్రాలను లైజాన్ వర్కర్లకు అందజేసారు. సర్వే ఏ విధంగా చేయాలో వివరించారు. 70 వేల మందికి అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేసామన్నారు. ప్రభుత్వం రైతు భరోసా అందిస్తోందని ఆయా డబ్బును కాఫీ తోటల అభివృద్ధికి పెట్టుబడిగా ఉపయోగించుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేసారు. ప్రభుత్వం రూ.13500లు రైతు భరోసాగా అందిస్తోం దని దీనిని వ్యవసాయం, ఉద్యాన వన పెట్టుబడులకు వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 20న ఆర్ వి నగర్ కాఫీ సాగుపై శిక్షణకు ఉద్యాన వన అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ, 52 నర్సరీలలో కాఫీ మొక్కలు సాగవుతున్నామన్నారు. ఈ ఏడాది మరో 16 వేల ఎకరాలలో కాఫీ తోటల విస్తరణకు చర్యలు చేపట్టామన్నారు. పాత కాఫీ తోటలో పొదల తొలగింపు, ప్రూనింగ్ పనులు చేసేలా కాఫీ రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ (పిటిజి) ఎం.వేంకటేశ్వరరావు, కాఫీ బోర్డు డిడి జయంతి ఘోష్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, ఐటిడిఎ పిహెచ్ఒ ఎన్.అశోక్, ఎస్ఎల్ఒ విష్ణు, ఉద్యాన వన అధికారులు, లైజాన్ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య

సిహెచ్‌సి వైద్యులను కొనసాగించాలి

- సిపిఎం నాయకులు సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం సిహెచ్‌సిలో ప్రస్తుతం ఉన్న వైద్యులను యథావిధిగా కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూనవరం సిహెచ్‌సిలో ఖర్చు లేకుండా స్పెషలిస్టు వైద్యులు వైద్యం చేస్తున్నారని తెలిపారు. మెరుగైన వైద్యం అందిస్తున్న వీరిలో కొంత మందిని అధికారులు డిప్యూటేషన్‌పై పంపడం సరికాదని పేర్కొన్నారు. దీని వల్ల ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వైద్యం అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మూడు మండలాల ప్రజలకు ఈ ఆసుపత్రి అందుబాటులో ఉందని, ఇలాంటి ఆసుపత్రిలో వైద్యులను డిప్యూటేషన్‌పై పంపించేసి ఇక్కడి ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేయడం దారుణమన్నారు. తక్షణమే సిహెచ్‌సిలోని అన్ని విభాగాలకు వైద్యులను తిరిగి నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, నాయకులు బొగ్గా రామారావు, బొగ్గా సుబ్బయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, బాబు, బొర్రయ్య, పాయం రాధ తదితరులు పాల్గొన్నారు.

ధారాలమ్మ గరగలు ఊరేగింపు

ప్రజాశక్తి -సీలేరు

ధారాలమ్మ అమ్మవారి 59వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నుంచి అమ్మవారి గరగలను సీలేరులో డప్పులు వాయిద్యాలతో ఊరేగించారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లోని గ్రామాల్లో 21న జరగనున్న ప్రధాన పండుగ ముందు రోజు వరకు గరగలు ఊరేగింపు నిర్వహిస్తారు. 21న ప్రధాన పండుగ రోజు ధారాలమ్మ అమ్మవారి సన్నిధిలో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



గరగలను ఊరేగిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

చింతపల్లిలో ఆరుగురు, సీలేరులో ఒకరు డిబార్



ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి పరీక్ష రాసేందుకు వచ్చిన ఇంటర్ విద్యార్థులు

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మాస్ కాపీయింగ్‌కు పాల్పడినందుకు చింతపల్లిలో ఆరుగురు, సీలేరు ఒకరిని అధికారులు డిబార్ చేశారు.

ప్రజాశక్తి-పాడేరు టౌన్

అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ పరిధిలోని 11 మండలాల్లో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్న నిబంధన కారణంగా విద్యార్థులు పరీక్షల కేంద్రాల వద్దకు ముందుగానే చేరుకున్నారు. పరీక్షలు మొదటి రోజు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు తరలి వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాడేరు డివిజన్‌లో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రం ఎలో ఒకేషనల్, జనరల్ మొత్తం 574 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 530 మంది పరీక్షకు హాజరయ్యారు. 44 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రం బిలో మొత్తం 212 మంది విద్యార్థులకు గాను 198 మంది విద్యార్థులు హాజరు కాగా, నలుగురు గైర్హాజరయ్యారు. జిటిడబ్ల్యు గురుకుల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 382 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 363 మంది హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు పరీక్షకు రాలేదు. మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 956 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా, 893 మంది పరీక్షకు హాజరు కాగా 63 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 346 మందికిగాను పరీక్షకు 37 మంది విద్యార్థులు హాజరు కాలేదని స్థానిక కళాశాల ప్రిన్సిపల్ కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు.పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కళాశాల ప్రిన్సిపల్ కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు.

విద్యార్థుల డిబార్

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఇంటర్ పరీక్ష కేంద్రంలో బుధవారం ప్రథమ సంవత్సర పరీక్షలుత ప్రారంభమయ్యాయి. 49 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 48 మంది పరీక్షలు హాజరయ్యారు. ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రారంభమైన గంట వ్యవధిలోని సిఇసి విద్యార్థి పెట్ల ప్రవీణ్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడగా, వెబ్ కెమెరా ద్వారా చీఫ్ సూపరింటెండెంట్ ఎ.సాయిరాం, డిపార్ట్‌మెంటల్ అధికారి కెవి రత్నం గుర్తించి, సదరు విద్యార్థిని డిబార్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కి పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పరీక్ష కేంద్రంలో వెబ్ కెమెరాలు ఉన్నాయని, మాస్ కాపీయింగ్ ఎవరు పాల్పడినా తప్పించుకోలేరని స్పష్టం చేశారు. వెబ్ కెమెరాలు ద్వారా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు, ఐటీడీఏ పిఒ రోణంకి గోపాలకృష్ణ నిరంతరం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. ఇది ఇలా ఉండగా చింతపల్లి పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు.

13 మంది గైర్హాజర్

రాజవొమ్మంగి : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 13 మంది విద్యార్థులు గైరాజరైనట్లు స్థానిక చీఫ్ ఎగ్జామినర్ విజయ రామ్మోహన్‌రావు తెలిపారు. 305 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 292 మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు. మండలంలోని జూనియర్ కళాశాల విద్యార్థులు, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ప్లస్ టు, ఏపీ గురుకుల కళాశాల విద్యార్థులు పరీక్షలు రాశారు. స్థానిక సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్సైలు గోపి నరేంద్ర ప్రసాద్, షరీఫ్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటిరోజు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి.



రాజవొమ్మంగిలో పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల వాలంటీర్ ఆర్గనైజేషన్ ప్రతినిధి పి.శివప్రసాద్ మాట్లాడుతూ, వస్తువుల కొనుగోలులో మోసపోతే జాతీయ వినియోగదారుల పరిరక్షణ చట్టం 2019 ద్వారా వినియోగదారుల ఫోరంని ఆశ్రయించి నష్టానికి పరిహారాన్ని పొందవచ్చునని చెప్పారు.జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్ మాట్లాడుతూ, వినియోగదారుల పరిరక్షణ చట్టం ఆవిర్భావం, వినియోగదారుల హక్కులపై తెలియ జేసారు. వినియోగదారుల హక్కుల పరిరక్షనే లక్ష్యంగా ప్రతినెల వినియోగదారుల చట్టం అవగాహనకు విడుదల చేయబోతున్న మేలుకొలుపు సంచికపై తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ భాషా, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ బి.గణేష్ కుమార్, జిసిసి డివిజినల్ మేనేజర్ కె.పార్వతమ్మ, కన్స్యూమర్ ఆర్గనైజేషన్ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షునిగా రామారావు నాయుడు

ప్రజాశక్తి-హుకుంపేట



మండలంలోని తడిగిరి పంచాయతీ తడిగిరి గ్రామానికి చెందిన పూజారి రామారావు నాయుడును అల్లూరి సీతారామరాజు జిల్లా కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ కిశాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు. జెట్టి గురునాథ్‌రావు, రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఎస్టీ విభాగం చైర్మన్, అరకు నియోజకవర్గ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ప్రకటనలో బుధవారం తెలిపారు.గతంలో తడిగిరి పంచాయతీ సర్పంచ్‌గా పంచాయతీ ప్రజలకు మంచి సేవలు అందించి హుకుంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సుమారు పది సంవత్సరాలు పని చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి రామారావు నాయుడుకు ఈ పదవి ఇచ్చిందని వారు పేర్కొన్నారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మట్టం పరశురాం, అరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇన్చార్జి జంపరాంగి వెంకటబాబు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా టీబీ వైద్యాధికారి

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా క్షయ నివారణపై జిల్లా టీబీ వైద్య అధికారి బి.విశ్వేశ్వర నాయుడు బుధవారం అవగాహన కల్పించారు. కొంతిలి హెల్త్ క్లినిక్ సెంటర్ లో రికార్డులను తనిఖీ చేశారు. వ్యాధిగ్రస్తులు టీబీ మందుల వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, రెండు వారాలకు మించి దగ్గు, దగ్గుతో పాటు కఫం, రాత్రిపూట జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాలకు వెళ్ళినప్పుడు తల్లిదండ్రులతో పాటు చుట్టుపక్కల ఉన్న వారికి క్షయ నివారణపై తెలియజేయాలన్నారు. ప్రతి నెలా మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్వైజర్ సదానందం, ఎంఎల్‌హెచ్‌పిఓ స్వప్న, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోగులను బస్సులో అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

మెరుగైన వైద్యానికి 'అనిల్ నీరుకొండ'కు తరలింపు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టాం, గత్తుం, పాతకోట తదితర పంచాయతీల వాసులకు ప్రజలకు వైద్య సేవలను మంగళవారం, బుధవారం అనిల్ నీరుకొండ ఆసుపత్రి సిబ్బంది వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. కొంతమంది రోగులను బస్సులో అనిల్ నీరుకొండ హాస్పటల్ కు తలించారు. ఉచిత భోజనాల తో పాటు వసతులు ఏర్పాటు చేస్తునారు. ఈ కార్యక్రమంలో అనిల్ నీరుకొండ హాస్పటల్ సిబ్బంది జె. బోంజుబాబు, ఎస్.సుందర్, జె.రాజారావు, ఎస్. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో న్యూ హ్యాంప్‌షైర్ వర్సిటీ బృందం

ప్రజాశక్తి-మధురవాడ : అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ హ్యాంప్‌షైర్ అకడమిక్ నిపుణుల బృందం బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాయాన్ని సందర్శించింది. న్యూ హ్యాంప్‌షైర్ డీన్ మైక్ డిసెల్లే, గ్రాడ్యుయేట్ స్కూల్ డీన్ డాక్టర్ కేరీమూర్‌హెడ్, ఇంజినీరింగ్ విభాగం చైర్మన్ క్రిస్టోఫర్ లెబ్‌ల్యాంక్, అడ్మిషన్ల విభాగం సహాయ డైరక్టర్ మేడిసన్ ఫెరేరి గీతం ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్లు, డీన్‌తో సమావేశమై బోధన, పరిశోధన అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో న్యూ హ్యాంప్‌షైర్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సులను, పరిశోధన అవకాశాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమానికి గీతం అదర్ కెరీర్ ఆప్షన్స్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికాంత్ సంధానకర్తగా వ్యవహరించారు.

సకాలంలో సరుకులు సరఫరా చేయాలి

పంచదార, కందిపప్పు పంపిణీకి ఇండెంట్ పెట్టండి
పక్కదారి పడితే కేసులు నమోదు
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: రేషన్ లబ్ధిదారులందరికీ సకాలంలో నిత్యావసర వస్తువులు అందించాల్సిందేనని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ డీలర్లను, జిసిసి మేనేజర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పౌర సరఫరాలు, జిసిసి మేనేజర్లు, డి.ఆర్. డిపోల డీలర్లతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకానికి, గిరిజన లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు వాహనాలు, అదనపు హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లను గతంలో వారు చేయని ప్రాంతానికి బదిలీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత కొన్ని నెలలుగా స్టాక్ రికన్సిలేషన్ చేయించని జిల్లా మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ లోపు రికన్సిలేషన్ చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మేనేజర్ సర్వీస్ పుస్తకాలను కార్యాలయానికి పంపాలని, రికన్సిలేషన్ చేయించని వారి సర్వీస్ పుస్తకాలలో మార్కు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. సకాలంలో సరుకులు సరఫరా చేయకున్నా సరుకులు పక్క దారి పట్టినా, తూనికలలో తేడాలున్నా కేసులు నమోదు చేయాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో మరణాలు సంభవించినా, వారి పేరుతో సరుకులు డ్రా చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా స్టాక్ పంపిణీ కాకుండా పెండింగ్ ఉంటె చర్యలు తప్పవన్నారు. జిల్లాలో పంచదార ఎందుకు సరఫరా చేయలేదని, అవసరం మేరకు ఇండెంట్ ఎందుకు పెట్టలేదని డీలర్లను కలక్టర్ ప్రశ్నించారు.గిరిజనులకు పంచదార అవసరం లేదా?, వారు ఎక్కువ డబ్బు పెట్టి బయట కొనుగోలు చేయాలా అని అసహనం వ్యక్త పరిచారు. ఈ నెల నుండి కంది పప్పు, పంచదారకు ఇండెంట్ పెట్టల్సిందేనని ఆదేశించారు. ఒక వేళ లబ్ధిదారులు తీసుకోకుంటే సంభందిత సర్పంచ్‌లతో మాట్లాడతానని స్పష్టం చేసారు. స్టాక్ సకాలంలో ఆథరైజ్ చేయాల్సిన భాద్యత మేనేజర్, తహసిల్దార్లదేనని స్పష్టం చేసారు. తహసిల్దార్లు కనీసం ఐదు డిపోలను తనిఖీ చేయాలన్నారు.బ్యాంకర్లతో మాట్లాడి హమాలీలందరికీ ప్రధానమంత్రి భీమా పధకంలో చేర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్. శివ ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గణేష్, జిసిసి డివిజినల్ మేనేజర్లు పార్వతమ్మ, సింహాచలం, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చనిపోయిన మేక మాంసం తిని చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : చనిపోయిన మేక మాంసం తిన్న ఐదేళ్ల చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయిన ఘటన అరకులోయ మండలం గన్నెల పంచాయతీ తడక గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తడక గ్రామంలో సోమవారం ఒకే కుటుంబానికి చెందిన పది మంది చనిపోయిన మేక మాంసాన్ని తాగువలస గ్రామంలో కొని తెచ్చుకుని వంట చేసుకుని తిన్నారు. కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఐదేళ్ల చిన్నారి మామిడి మీనాక్షి మంగళవారం సాయంత్రం మృతిచెందింది. ఈ ఘటన బుధవారం వెలుగుచూసింది. విషయం తెలుసుకున్న ఆశా కార్యకర్త అంబులెన్సుకు ఫోన్ చేసి అస్వస్థతకు గురైన వారందరినీ గన్నెల పిహెచ్‌సికి తరలించింది. మామిడి చిన్నయ్య, మామిడి రత్నమ్మ, గెమ్మెలి అప్పారావు, మామిడి పైడన్న, మామిడి సింహాద్రి, మామిడి రంగారావు, గెమ్మెలి కలిమ్మ, చిన్నమ్మి, మామిడి అప్పలమ్మ, మూడేళ్ల చిన్నారి శ్రీవల్లి అస్వస్థతకు గురైన వారిలో ఉన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన మీనాక్షి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

17న మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు టౌన్

ఈనెల 17న అల్లూరి జిల్లా అరకులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదర్ అండ్ ఫాథర్ హెూమ్ కేర్ సర్వీసెస్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వైఎస్ కె ఇన్ఫోటెక్ కంపెనీల్లో పోస్టులు ఉన్నాయన్నారు. టెన్త్ ఆపై విద్యార్హతలున్న ఆసక్తి కలిగిన 18 నుండి 30 సంవత్సరాలలోపు వయసు కలిగిన పురుషులు, మహిళలు జాబ్ మేళాకు హాజరు కావొచ్చని, వివరాలకు ఫోన్: 7993795796, 9398338105 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గీతం వర్సిటీకి డిఎస్‌టి పరిశోధన ప్రాజెక్టు

ప్రజాశక్తి-మధురవాడ : స్థానిక పరిశ్రమలకు విద్యాలయాలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, నిరంతర శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో విద్యాలయాలను అనుసంధానం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సాంకేతిక విజ్ఞాన కేంద్రం (జి-టెక్) ఏర్పాటుకు భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) రూ.3.28 కోట్ల భారీ ప్రాజెక్టును మంజూరు చేసిందని గీతం రీసెర్చి అండ్ డెవలప్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా గీతంలో ఏర్పాటవుతున్న జి-టెక్ విజ్ఞాన కేంద్రం త్వరలో తన కార్యకలాపాలను ప్రారంభించనుందని వెల్లడించారు. జి-టెక్ కార్యక్రమాలు గీతంతో పాటు రాష్ట్రంలోని సహ విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసే విధంగా ఉంటాయని తెలిపారు. వివిధ విద్యా సంస్థలలోని పరిశోధకుల నూతన ఆవిష్కరణలను గుర్తించడం, వాటికి మార్కెటింగ్ అవకాశాలను తెలియజేయడంతో పాటు స్థానిక పరిశ్రమల సాంకేతిక అవసరాలను తెలుసుకుని వాటికి అవసరమైన నూతన పరిజ్ఞానాన్ని ప్రయోగశాలలో అభివృద్ధి చేయడంపై జి-టెక్ దృష్టి సారిస్తుందని చెప్పారు. పరిశోధకుల మధ్య బలమైన సంబంధాలను నెలకొల్పడానికి సదస్సులు, వర్క్‌షాప్‌లు, చర్చా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి త్వరలో పరిశ్రమల నిపుణులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టును గీతం డీమ్డ్‌విశ్వవిద్యాలయానికి అప్పగించడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్‌తో యువతలో సేవాభావం

ప్రజాశక్తి-మధురవాడ : జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా యువతలో సేవా భావం పెరుగుతోందని, సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేస్తుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం పేర్కొన్నారు. గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. రక్తం అందించడం ద్వారా అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి ప్రాణాలు నిలుస్తాయన్నారు. ప్రస్తుత అవసరాలను గుర్తించి యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరంలోని వివిధ బ్లడ్ బ్యాంక్‌ల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు గీతంలో వరుసగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌విజి రెడ్డి, ప్రొఫెసర్ పివివై. జయశ్రీ, ప్రొఫెసర్ తమ్మిరెడ్డి, మదర్ రక్త నిధి కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో 'స్టేక్ హోల్డర్స్ కో-ఆర్డినేషన్ అండ్ లీడర్ షిప్' అంశంపై జైళ్ళశాఖ అధికారులకు మూడు రోజుల పాటు నిర్వహించిన సదస్సు బుధవారంతో ముగిసింది. ముగింపు సదస్సుకు ఇండియన్ నేవీ రిటైర్డ్ అడ్మిరల్ టి.సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టాన్ని ఉల్లంఘించిన నేరస్తులు ఉన్న జైళ్ళశాఖలో ఉద్యోగం చేయడం సాధారణ విషయం కాదన్నారు. దానికి ఎంతో నైపుణ్యం ఉండాలన్నారు. జైల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగీ ఒక లీడర్ అన్నారు. నేరస్తులను క్రమ శిక్షణలో పెట్టి వారిలో మార్పు తీసుకు రావడానికి నిరంతరం కృషి చేస్తూ తద్వారా సమాజానికి ఎంతో సేవ చేస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం జైళ్ళ శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు, ముఖ్యఅతిథి టి.సుధాకర్‌తో కలిసి సదస్సులో పాల్గొన్న అధికారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్రకారాగరాం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

లయన్స్ కేన్సర్ హాస్పిటల్‌కు రూ.25 లక్షల విరాళం

ప్రజాశక్తి-సీతమ్మధార: సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్, జనరల్ ఆసుపత్రికి లారస్ ల్యాబ్ రూ.25 లక్షల విరాళాన్ని అందించింది. లారస్ చారిటబుల్ ట్రస్ట్ సిఎస్ఆర్ కార్యకలాపాల క్రింద ఈ మొత్తాన్ని లారస్ ల్యాబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చావ సత్యనారాయణ హైదరాబాద్‌లో అందించారు. వైద్య పరికరాలు కొనుగోలు, ఇతర అభివృద్ధి కార్యకలాపాలు, రోగులకు సహాయం నిమిత్తం ఈ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా లారస్ చారిటబుల్ ట్రస్టుకు లయన్స్ కేన్సర్, జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ వి.ఉమామహేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తామని చెప్పారు.


శివలింగపురం స్టేషన్‌ను పరిశీలిస్తున్న మనోజ్ శర్మ, అనుప్ సత్పతి తదితరులు

రైల్వే లైన్ల తనిఖీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ బుధవారం కోరాపుట్ - కొత్తవలస రైల్వే లైన్లను తనిఖీ చేశారు. ట్రాక్, వంపులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించారు. కోరాపుట్ -కొత్తవలస సెక్షన్‌లో కొనసాగుతున్న డబుల్ లైన్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోరాపుట్ స్టేషన్‌లోని రన్నింగ్ రూమ్, రెస్ట్ హౌస్‌లను పరిశీలించారు. రన్నింగ్ రూమ్‌లోని లోకో పైలట్లు, మేనేజర్లతో సంభాషించారు. రైల్వే స్టేషన్‌లోని వ్యాపారులతోనూ మాట్లాడారు. అనంతరం చిమిడిపల్లి సమీపంలోని సొరంగాలను పరిశీలించారు. ఆయన వెంట వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి, తదితరులు ఉన్నారు.

పోలీసులా.. వైసిపి కార్యకర్తలా..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని పోలీసులు వైసిపి కార్యకర్తల్లా మారిపోయారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు విమర్శించారు. బుధవారం ఉదయం లాసన్స్ బే కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీలో ప్రథమ స్థానం సాధించానని చెప్పుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎక్కడ ఓటు వేశారో చెప్పాలన్నారు. అసలు ఓటు నమోదు చేసుకున్నారా ? లేదా ? అన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలన్నారు. డిఎల్‌బి స్కూల్ వద్ద ఎన్నికల రోజున ఎస్ఐ సతీష్ కుమార్ టిడిపి 46వ వార్డు అధ్యక్షుడు పైడికొండ పసుపు షర్టు వేసుకున్న కారణంగా షర్టు విప్పించారని, అదే రోజున కలెక్టర్ కూడా లైట్ ఎల్లో కలర్ షర్ట్ వేసుకున్నారని, ఆయన్ని ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం చేసిన అక్రమాలపై రాష్ట్ర గవర్నర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర పాల్గొన్నారు

బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహారాణిపేటకు చెందిన మద్దాల జ్ఞాన సాయి వర్మ ఈ నెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ బాలుడు తల్లి మద్దాల రోజా మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కెడిపిఎం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న జ్ఞాన సాయి వర్మ ఎప్పటిలాగే స్కూలుకు వెళ్లాడని తెలిపింది. లేత నీలి రంగు చొక్కా, ముదురు నీలి రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని, ఐదు అడుగుల ఎత్తు ఉంటాడని ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తులో ఉంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : బయ్యపురెడ్డిపాలెంలో సీతారామ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 16వ తేదీ గురువారం నుండి 18 వరకు మూడు రోజులు పాటు దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక విలేకరులకు తెలిపారు. మొదటి రోజు హరినామ సంకీర్తన, శుక్రవారం సాయంత్రం జాతీయ పురస్కార గ్రహీత ఎన్‌డిసిపి పానంగిపల్లి రంగనాథ చార్యులు సుదర్శనం సీతారామాచార్యులతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణం, శనివారం మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం గ్రామ పురవీధుల్లో స్వామి పల్లకి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

సిఎస్.రావు మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యాభిమాని, ప్రజాపక్షపాతి, రిటైర్డ్ ఐఇఎస్ అధికారి సిఎస్.రావు మృతి పట్ల ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్ఒ) ఓ ప్రకటనలో సంతాపం తెలిపింది. ఈ మేరకు సంఘం విశాఖ జిల్లా నేతలు కె.అభిలాష్, బి.సంతోష్ ఒక ప్రకటన విడుదల చేశారు.

సిపిఎస్ రద్దుకు 26న విశాఖలో రాష్ట్ర సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యూనియన్ల నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న విశాఖ డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలని ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్లు నిర్ణయించాయి. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ హోంలో జరిగిన మీడియా సమావేశంలో ఎపి ఎన్‌జివోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.శివారెడ్డి, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ మాట్లాడుతూ 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, కొత్త పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. చిన్న రాష్ట్రాలు దీనికి భిన్నంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒపిఎస్‌ను తేలేదు కానీ కొత్తగా జిపిఎస్‌ను తీసుకొచ్చి దుర్మార్గమైన పద్ధతికి శ్రీకారం చుట్టారన్నారు. 30 ఏళ్ల పాటు సేవ చేసి పొందుతున్న పెన్షన్‌ను రద్దు చేయడం, కేవలం ఐదేళ్లపాటు రాజకీయ జీవితం సాగించే ప్రజాప్రతినిధులకు మాత్రం జీవితాంతం పెన్షన్ ఇవ్వడం శోచనీయమన్నారు. ముందు వారికి సిపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం పెన్షన్ ఉద్యోగుల, కార్మికుల జన్మ హక్కు అని, వారి కుటుంబాలకు భద్రత అవసరమని పేర్కొందని గుర్తు చేశారు. కరోనా సమయంలో మరణించిన ఉద్యోగుల వారసులకు తక్షణం ఉద్యోగాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సవరణను అమలు చేయాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును ఇవ్వడానికి కూడా ప్రభుత్వాలు సహకరించడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిఎ బకాయిలను చెల్లించాలన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, రైల్వే ప్రైవేటీకరణను ఆపాలన్నారు. 26న జరిగే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఆర్‌టిసి సిబ్బందిపై
దాడులకు పాల్పడ్డవారిని శిక్షించాలి


నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి సిబ్బందిపై కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి ఎ.సీతాలక్ష్మి, అధ్యక్షులు పి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ రూరల్ డిపో ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోకు సమీపంలోనే విధులకు హాజరవుతున్న సిబ్బందిపై ఇటు వంటి దాడులు జరగడం దారుణమన్నారు. డిపోకు ఎదురుగా ఉన్న బస్ స్టాప్ కొంతకాలంగా నిరుపయోగంగా ఉందని, అక్కడకు చేరిన కొంతమంది ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలతో సిబ్బందిలో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని పేర్కొన్నారు.

సిబ్బంది బాగోగులు చూడవలసిన డిపో యాజమాన్యం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయ మన్నారు. దీనివల్ల సిబ్బందిలో భయాందోళలు పెరిగి, డిపో ఆదాయంపై దాని ప్రభావం పడుతుందన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కెఆర్.కుమార్ మాట్లాడుతూ ఆర్‌టిసి సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎసి.ప్రసాద్, వర్మ, బి.స్వామి, కరీముల్లా, ఎంకె.రావు, వాసు, దేవుడు, ఎస్.రామారావు పాల్గొన్నారు.


తమ పేరుతో ఉన్న సాగు రికార్డు పత్రాలను చూపుతున్న చటర్జీపురం ఆదివాసీలు

సాగులో ఉన్నా.. రికార్డుల నుంచి తొలగింపు

- ఆందోళనలో చటర్జీపురం ఆదివాసీలు

ప్రజాశక్తి-రోలుగుంట: అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఎంకె.పట్నం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 139లోని పదెకరాల భూమిలో చటర్జీపురంకు చెందిన గదబ ఆదివాసీలకు చెందిన నాలుగు కుటుంబాలు తరతరాలుగా సాగులో ఉన్నాయి. కేదారి రాజుబాబు అనే కుటుంబం కూడా అదే భూమిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంది. గిరిజనులు మెట్ట పంటలను పండిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. గతంలో వీరిచ్చిన వినతిపత్రాలపై స్పందించిన రోలుగుంట రెవెన్యూ అధికారులు వారి సాగు అనుభవాన్ని తనిఖీ చేసి సాగుబడి రిజిస్టర్‌లో వారి వారి పేర్లను కూడా నమోదు చేశారు. వారికి సాగు బడి రిజిస్టర్ సర్టిఫికేట్ కాపీలు కూడా ఇచ్చారు. అయితే తమ సాగులో ఉన్న భూమిని కాకినాడ జిల్లా బిక్కవోలు మండలానికి చెందిన ఒక వ్యక్తి పేరుతో మార్చే యబోతున్నారని తెలుసుకొని ఆదివాసీలు స్థానిక అధికారులకు గతంలోనే విజ్ఞప్తి చేశారు. నర్సీపట్నం న్యాయస్థానంలో కూడా ఆ గిరిజనేతరుడిపై దావా వేసుకున్నారు. తాము దాఖలు చేసిన కేసు వివరాలను రోలుగుంట రెవెన్యూ అధికారులకు కూడా అందజేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్ని బాధితులు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

సాగులో ఉన్న వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, తమ వాదనలూ వినకుండా రికార్డుల్లో మార్పు చేయడం చట్టపరంగా చెల్లదు. కానీ గత ఏడాది నవంబర్‌లో తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు ఆయా రికార్డులు మార్పు చేయడంతో పాటు సాగుబడి రిజిస్టర్‌లో అప్పటికే నమోదైన తమ పేర్లను తొలగించేశారని బాధితులు ఆరోపించారు. ఈ సందర్భంగా నీలాపు నూకాలమ్మ మాట్లాడుతూ తమకు ఈ భూమి తప్పా వేరే జీవనాధారం లేదని, భూమిని, వ్యవసాయాన్ని నమ్ముకొని తాతల నుంచి నుండి ఇక్కడే జీవిస్తున్నామని, అధికారులు తమకు అన్యాయం చేస్తున్నారని గగ్గోలు పెట్టింది. ఇంకో రైతు నీలాపు అప్పలనాయుడు మాట్లాడుతూ, తహశీల్దార్ వెంకటేశ్వరరావు తమ విజ్ఞప్తులపై స్పందించి భూముల్ని పరిశీలించారని, అయినప్పటికీ అవతలి వర్గం ఇచ్చిన లంచాలకు కుక్కర్తి పడి తమ పేర్లను తొలగించారని ఆరోపించారు.

ఈ విషయమై అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం మండల కన్వీనర్ మోసూరి రాజు మాట్లాడుతూ నాన్ షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీలకు అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత చాలా అన్యాయం జరుగుతోందని వాపోయారు. చీడికాడ నుంచి నాతవరం ప్రాంతంలోని మండలాల్లో ఆదివాసీల సాగులో ఉన్న భూముల్ని ఏకపక్షంగా రికార్డులు మార్చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం కనిపించడం లేదన్నారు. ఆ సంఘం జాతీయ ప్రతినిధి పిఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ చటర్జీపురం ఆదివాసీలకు జరిగిన అన్యాయంపై తాము గతంలోనే నర్సీపట్నం ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చామన్నారు. తొలగించిన ఆదివాసీ సాగుదారుల పేర్లను రికార్డుల్లో పునరుద్దరించాలని కోరామని, అయినప్పటికీ చర్యలు మాత్రం శూన్యమన్నారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరిధిలోని రోలుగుంట మండలం ఉందని, గొలుగొండ మండలంలో అప్రతిష్టపాలైన తహశీల్దార్ వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే స్వయంగా రోలుగుంట మండలానికి రప్పించారని ఆరోపించారు. ఆదివాసీలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంటుందని కనీసం ఆర్డీవో స్థానిక అధికారుల సమక్షంలో సమీక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 18న రోలుగుంట తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి అక్కడి వారు సంఘీభావం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

మసీదు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చిన వాల్తేరులోని మహమ్మదీయ మసీదును విశాఖ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గతంలో కొంతమంది వ్యక్తులు మసీదును స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా హైకోర్టు ఆదేశాలతో వక్ఫ్‌బోర్డు అధికారులు మసీదును స్వాధీనం చేసుకున్నారు.